



విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నదిపై గతంలో కూలిపోయిన వంతెన.. ఇక్కడ కొత్తగా భారీ వంతెన నిర్మిస్తారు.

వాల్టాకు తూట్లు!

యథేచ్ఛగా గెడ్డలు, వాగులు కబ్జా చేస్తున్న రియల్టర్లు

- వెంచర్లలోకి దర్జాగా రహదారుల నిర్మాణం
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్న రెవెన్యూ అధికారులు
- కనుమరుగవుతున్న సహజసిద్ధ నీటి ప్రవాహాలు



గొల్లలపాలెం సర్వే నంబరు 120లోని గెడ్డవాగును ఆక్రమించి నిర్మించిన రహదారి

సబ్బవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని గొల్లలపాలెంలో సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి వనరులు కనుమరుగవుతున్నాయి. ఈ ప్రాంతంలో లేఅవుట్లు వేసిన కొంతమంది రియల్టర్లు.. గెడ్డలు, వాగులను కప్పేసి, వెంచర్లలోకి రోడ్లు నిర్మించుకుంటున్నారు. స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప.. చట్టప్రకారం చర్యలు తీసుకోవడంలేదు. గెడ్డలు, వాగులు పూడ్చివేయడం వల్ల వర్షాలు కురిసినప్పుడు గెడ్డ నీరు పంట పొలాలను ముంచేస్తున్నదని రైతులు వాపోతున్నారు.**



గొల్లలపాలెం సర్వే నంబరు 219 గెడ్డవాగులో నుంచి లే-అవుట్‌కు ఏర్పాటు చేసిన రోడ్డు

గొల్లలపాలెం సర్వే నంబరు 219లో 24.25 ఎకరాలు గెడ్డ వాగు పోరంబోకు/ప్రభుత్వ భూమి ఉంది. దీనికి ఎగువన వున్న జిరాయితీ భూమిని (సర్వే నంబర్లు 216, 218) ఒక వ్యక్తి కొనుగోలు చేసి, లే-అవుట్ వేశారు. ఇందులోకి వాహనాలు వెళ్లడానికి రోడ్డు సదుపాయం కొంతమంది స్థానిక నేతల సహకారంతో సర్వే నంబరు 219లోని గెడ్డవాగును కబ్జా చేసి రహదారి నిర్మించారు. దీనిపై గొల్లలపాలెం రైతులు 2023 డిసెంబరులో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. కానీ కబ్జాదారునిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో కొద్ది రోజుల తరువాత మళ్లీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామస్థులు మరోసారి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారి స్పందించి లే-అవుట్‌కు ఏర్పాటు చేసిన రోడ్డుకు అడ్డంగా తవ్వేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో గెడ్డ వాగులోనే కొంచెం అవతలవైపు నుంచి తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తీసేశారు. మరోవైపు పంచాయతీ అనుమతులు లేకుండా లేఅవుట్ వేసినవారిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానిక రైతులు చెబుతున్నారు.

ఇదే గ్రామంలో సర్వే నంబరు 120లో 10.63 ఎకరాల గెడ్డ వాగు పోరంబోకు భూమి ఉంది. దీనిని ఇటీవల కొంత మంది ఆక్రమించి, చెట్లు నరికివేసి చదును చేశారు. ఈ ఆక్రమణ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

గొల్లలపాలెంలో సర్వే నంబరు 31లో 4.62 ఎకరాలు గెడ్డ వాగు పోరంబోకు భూమి ఉంది. ఇది గ్రామానికి అనుకొని ఉండడంతో గతంలో ఆక్రమించుకొన్న స్థానికులు కొంతమంది ప్రస్తుతం షెడ్లు నిర్మిస్తున్నారు. ఇంకా గ్రామాన్ని అనుకొని ఉన్న సర్వే నంబరు 249లో 69 సెంట్లు గెడ్డవాగు ఉంది. గతంలో ఇది కబ్జాకు గురవుతుంటే అప్పటి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టారు. ప్రస్తుతం ఆ బోర్డు కనిపించడం లేదు. సర్వే నంబరు 224లో 3.99 ఎకరాలు (సంపద కేంద్రం సమీపంలో) గెడ్డవాగు ప్రభుత్వ భూమి ఉంది. దీనిని కొంతమంది ఆక్రమించగా.. గతంలో వీఆర్వో హెచ్చరిక బోర్డు పెట్టారు. కొద్ది రోజులకే కబ్జాదారులు బోర్డును పీకేశారు.

జిల్లాలో స్టేట్ హైవే

సబ్బవరం టు నర్సీపట్నం.. వయా చోడవరం

- రెండు లేన్లుగా అభివృద్ధి
- పీపీపీ విధానంలో నిర్మాణం
- తొలి దశ ప్యాకేజీ-2లో చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం
- మూడు నెలల్లో టెండర్ల ప్రక్రియ?
- వాహనదారులు, ప్రయాణికులకు తీరనున్న ఇక్కట్లు

చోడవరం, ఫిబ్రవరి 16: **ఐదేళ్ల నుంచి వాహనదారులకు, ప్రయాణికులకు ప్రత్యక్ష నరకంగా తయారైన బీఎన్ రోడ్డు (భీమునిపట్నం-నర్సీపట్నం)కు మహర్దశ పట్టనున్నది. కూటమి ప్రభుత్వం దీనిని 'స్టేట్ హైవే'గా ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో అభివృద్ధి చేయనున్న జాబితాలో చేర్చింది. సబ్బవరం నర్సీపట్నం వరకు సుమారు 80 కిలోమీటర్ల రహదారికి అభివృద్ధికి మరో మూడు నెలల్లో టెండర్లు పిలవనున్నట్టు సమాచారం. పనులు పూర్తయిన తరువాత జాతీయ రహదారుల తరహాలోనే ఈ రోడ్డులో కూడా టోల్ ఫీజు వసూలు చేస్తారు.**

వాహనాల రద్దీ అధికంగా వుంటే ఆర్‌అండ్‌బీ రహదారులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో స్టేట్ హైవేలుగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఎంపిక చేసిన రహదారులను మొత్తం ఎనిమిది ప్యాకేజీలుగా విభజించింది. ఇందులో అనకాపల్లి జిల్లాలో భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డుకు చోటు లభించింది. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం-పార్వతీపురం, అనకాపల్లి జిల్లాలో సబ్బవరం నుంచి చోడవరం, వడ్డాది, కొత్తకోట మీదుగా నర్సీపట్నం వరకు ఆర్‌అండ్‌బీ రహదారులను స్టేట్ హైవేలుగా అభివృద్ధి చేయాలని రెండో ప్యాకేజీలో చేర్చారు. ఈ రెండు రహదారులను రూ.480 కోట్లతో రెండు వరుసలుగా అభివృద్ధి చేస్తారు. ఇందుకు సంబంధించి మరో మూడు నెలల్లో టెండర్లు ఆహ్వానించే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం. వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద నిర్మాణ వ్యయంలో 20 శాతం కేంద్రం, 20 శాతం రాష్ట్రం ఇస్తాయి. మిగిలిన మొత్తం కాంట్రాక్టు కంపెనీ భరించాలి. గోవాడ, వడ్డాది, విజయరామరాజుపేట తదితర ప్రాంతాల్లో నదులపై కొత్తగా వంతెనలు నిర్మిస్తారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తుంది. రహదారి నిర్మాణం పూర్తయిన తరువాత టోల్ ప్లాజాలను ఏర్పాటు చేసి, టోల్ ఫీజు వసూలును కాంట్రాక్టు కంపెనీకి అప్పగిస్తారు. స్టేట్ హైవే అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. వాహనాలు సైతం పాడవకుండా వుంటాయి.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

వాస్తవానికి బీఎన్ రోడ్డు ఎన్నో ఏళ్లుగా ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయింది. ఎట్టకేలకు 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధికి రూ.119 కోట్లు కేటాయించింది. ఇందులో 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం, మిగిలిన 70 శాతం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నుంచి రుణంగా తీసుకోవాలి. టెండర్లు సైతం ఖరారయ్యాయి. పనులు మొదలుపెట్టిన తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. సుమారు ఐదు కోట్ల రూపాయల విలువ చేసే పనులు పూర్తయిన అనంతరం ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. మొబిలైజేషన్ అడ్వాన్సు కూడా ఇవ్వలేదు. దీంతో ఎన్‌డీబీ అధికారులు.. రాష్ట్ర ప్రభుత్వ వాటా 30 శాతం నిధులు విడుదల చేసిన తరువాతే రుణం నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఐదేళ్లపాటు ఇదే తంతు నడిచింది. రహదారి మరింత అధ్వానంగా తయారవడంతో ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం.. రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. బీఎన్ రోడ్డులో భాగమైన సబ్బవరం- నర్సీపట్నం (వయా చోడవరం, వడ్డాది, కొత్తకోట) రహదారిని పీపీపీ విధానంలో రెండు లేన్లుగా అభివృద్ధికి చర్యలు చేపట్టింది.



చోడవరంలో పూర్తిగా ఛిద్రమైన బీఎన్ రోడ్డు

చికెన్ అమ్మకాలకు బర్డ్ ఫ్లూ దెబ్బ

కొనుగోలుదారుల లేక వెలవెలబోయిన దుకాణాలు

- మటన్, చేపల కొనుగోలుకు మాంసాహారులు మొగ్గు

ఎలమంచిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఎలమంచిలిలో చికెన్ విక్రయాలు ఒక్కసారిగా పూర్తిగా పడిపోయాయి. ఆదివారం కొనుగోలుదారులతో సందడిగా వుండే చికెన్ దుకాణాలు.. ఈసారి వెలవెలబోయాయి. ఇదే సమయంలో మాంసాహారులు మటన్, చేపల కొనుగోలుకు ఆసక్తి చూపడంతో ఆయా దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ముఖ్యంగా చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిట లాడింది. చుట్టుపక్కల వున్న చెరువుల్లో చేపల పట్టుబడికి రావడంతోపాటు గోదావరి జిల్లాల నుంచి కూడా చేపలు దిగుమతి కావడంతో చేపల వ్యాపారుల మధ్య పోటీ పెరిగింది. చేపలు కొనుగోలు చేసిన వారికి కొత్తిమీర కట్టను ఉచితంగా ఇచ్చారు. సాధారణంగా చికెన్ దుకాణాల వద్ద రద్దీ వుంటుంది. మటన్ షాపుల వద్ద అరకొరగా కొనుగోలుదారులు వుంటారు. కానీ బర్డ్ ఫ్లూ ప్రభావంతో సీన్ రివర్స్ అయ్యింది. చికెన్ షాపులు వెలవెలబోయాయి. ఎక్కువ రేటు అయిప్పటికీ అధిక శాతం మంది మటన్ కొనుగోలుకే మొగ్గు చూపారు.



కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న చికెన్ వ్యాపారి



కిటకిటాడుతున్న చేపల మార్కెట్



ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు మటన్ దుకాణం వద్ద రద్దీ

టొరెంట్ ఫార్మాలో ఇద్దరు కార్మికులకు అస్వస్థత



పరవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): **స్థానిక ఫార్మాసిటీలోని టొరెంట్ ఫార్మా పరిశ్రమలో ఆదివారం ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.**

టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కంపెనీ ప్రొడక్షన్ బ్లాక్‌లో సాల్వెంట్ ప్రాసెస్ పూర్తయిన అనంతరం దానిని డ్రయ్యర్‌లో నింపుతారు. ఆ సాల్వెంట్ పౌడర్‌గా తయారవుతుంది. మత్తుకు సంబంధించిన ట్యాబ్‌లెట్ పౌడర్ కావడంతో దాన్ని మిక్సింగ్ చేసే క్రమంలో కార్మికులు పి.రామకృష్ణ, జె.బసవేశ్వరరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని గమనించిన పరిశ్రమ ఉద్యోగి ఒకరు వారికి అక్కడే ప్రథమ చికిత్స చేశారు. అనంతరం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై అందిన సమాచారం మేరకు సీఐ

... మిగతా 6వ పేజీలో

పంట కాలువ దర్జాగా కబ్జా

సిమెంట్ తూము వేసి, రేకుల షెడ్డు నిర్మాణం

- ఇరిగేషన్ అధికారులకు రైతులు ఫిర్యాదు
- నోటీసు ఇచ్చినా పట్టించుకోని ఆక్రమణదారుడు
- రెవెన్యూ, పోలీసు శాఖల సహకారం కోరుతూ ఇరిగేషన్ ఏఈ లేఖ
- స్పందించకపోవడంతో మిన్నకుండిన ఏఈ
- మళ్లీ పలుమార్లు ఫిర్యాదు చేసిన రైతులు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు



సత్యవరం- శ్రీరాంపురం రోడ్డులో పంట కాలువపై నిర్మించిన షెడ్డు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): **సాగునీటి కాలువను ఓ వ్యక్తి దర్జాగా ఆక్రమించి, దానిపై షెడ్డు నిర్మించాడు. దీనిపై రైతులు పలుమార్లు ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదులు చేశారు. కబ్జాదారునికి అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కాలువపై నిర్మించిన షెడ్డును తొలగించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

మండలంలోని పెదరాంభద్రపురం రెవెన్యూ పరిధిలోని సత్యవరం- శ్రీరాంపురం రోడ్డు పక్కన పంట కాలువ వుంది. దీనికి అనుకుని రైతుల భూములు వున్నాయి. పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన ఒక రైతు గత ఏడాది జూన్‌లో కాలువపై భారీ సిమెంట్ తూము వేసి పైన మట్టి కప్పాడు. ఇందుకోసం ఇరిగేషన్ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదు. తరువాత కాలువ మీద నుంచి రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాడు. పనులు జరుగుతున్న సమయంలోనే స్థానిక రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణ పనులు నిలుపుదల చేయించి, ఇప్పటి వరకు నిర్మించిన కట్టడాన్ని తొలగించాలని కోరారు. కానీ అధికారులు పట్టించుకోలేదు. పంట కాలువను ఆక్రమించి షెడ్డు నిర్మిస్తున్న వైనంపై అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. అప్పుడు

... మిగతా 6వ పేజీలో

కీచక పీఈటీపై పోక్సో కేసు

- నర్సీపట్నంలో మేజిస్ట్రేట్ ఎదుట హాజరు
- 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా పవర్తించిన కాంట్రాక్టు వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) కుందూరు నూకరాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయస్థాయి ఆటల పోటీలకు కొంత మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరి వెంట వెళ్లిన పీఈటీ నూకరాజు.. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడడంతో విద్యా శాఖ అధికారులు స్పందించి పాఠశాలలో విచారణ జరిపారు. పీఈటీపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలడంతో అతనిని విధుల నుంచి తొలగించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. నూకరాజును ఆదివారం నర్సీపట్నంలో అడిషినల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14 రోజులపాటు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా పింక్ సఖీ శారీ వాక్



బీచ్ రోడ్డులో నిర్వహించిన పింక్ సఖీ శారీ వాక్‌లో పాల్గొన్న సినీ నటి గౌతమి, జీవీఎంసీ మేయర్ హరి వెంకట కుమారి, మహిళలు

విశాఖ తీరంలో ఆదివారం పింక్ సఖీ శారీ వాక్ సందడిగా సాగింది. క్యాన్సర్ రహిత సమాజమే ధ్యేయంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ప్రముఖ సినీ నటి, లైఫ్ అగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి పేర్కొన్నారు. పింక్ కలర్ దుస్తులు ధరించిన మహిళలు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గురుద్వార్ సత్సంగ్ అధ్యక్షుడు పీఎస్ ఆనంద్, ఏజీ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి ఎన్ఎస్ రాజు, రవీంద్ర, వరుణ్ గ్రూప్ సంస్థల చైర్మన్ ఎస్పీ ప్రభుకిశోర్ తదితరులు పాల్గొన్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

విశాఖలో ఐపీఎల్ సందడి

రెండు క్రికెట్ మ్యాచ్‌లకు వేదికగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియం

- మార్చి 24న తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్-లక్నో సూపర్ జెయింట్స్
- మార్చి 30న ఆడనున్న ఢిల్లీ క్యాపిటల్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్
- విడుదలైన షెడ్యూల్



విశాఖపట్నం, స్పోర్ట్సు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టాటా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండు మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. ఐపీఎల్ సీజన్-18 షెడ్యూల్‌ను ఆదివారం సాయంత్రం విడుదల చేసిన సందర్భంగా విశాఖకు రెండు మ్యాచ్‌లు కేటాయించారు. పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా మార్చి 24న ఢిల్లీ క్యాపిటల్స్-లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అదేవిధంగా మార్చి 30న ఢిల్లీ క్యాపిటల్స్-సన్‌రైజర్ హైదరాబాద్ జట్టు ఇదే గ్రౌండ్‌లో తలపడనున్నాయి.

గత ఏడాది పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఇక్కడ రెండు మ్యాచ్‌లు ఆడింది. ఈ ఏడాది కూడా ఇదే స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకోవడంతో రెండు మ్యాచ్‌లు ఆడేందుకు

... మిగతా 6వ పేజీలో

అభివృద్ధికి నోచుకోని రాంబిల్లి సంత ప్రాంగణం

- పూరిపాకల్లోనే వ్యాపారాలు
- చినుకు పడితే బురదమయం



రాంబిల్లిలోని సంత ప్రాంగణం

రాంబిల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సంత ప్రాంగణం ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకులు ఈ వారపు సంత ప్రాంగణాన్ని ఎంతో అభివృద్ధి చేస్తామని చేసిన ప్రకటనలు ఆచరణకు నోచుకోలేదు. ఏళ్ల క్రితం రాంబిల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని చెరువు గట్టుపై సంత ఏర్పాటు చేశారు. ఈ సంతకు పరిసర ప్రాంతాల్లోని 30 గ్రామాల ప్రజలు వస్తుంటారు. ప్రతి మంగళవారం ఇక్కడ సంత జరుగుతుంది. ఈ వారపు సంత ప్రాగణంలో కమ్మలపాకలు వేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. వర్షాల సమయంలో ఈ సంత ప్రాంగణం బురదమయంగా మారిపోతుండడంతో వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలకులైన స్పందించి సంత ప్రాంగణంలో షెడ్లు వేయించి, అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంజాయితో ఇద్దరు యువకుల అరెస్టు

చోడవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి చోడవరం మీదుగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. పట్టణ శివారు గౌరీపట్నం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు నాలుగు కిలోల గంజాయితో పట్టుబడ్డారని, వారి నుంచి వాహనంతోపాటు రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేశామని చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ జోగారావు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత : బండారు

కె.కోటపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చెప్పారు. మండలంలోని మేడిచెర్ల మల్లికార్జున స్వామి దేవాలయ 18వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కోరారు. కాగా ఉదయం నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. అనంతరం మహిళల ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. సాయంత్రం ఎడ్లబండ్ల పరుగు పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

టొరెంట్ ఫార్మాలో ఇద్దరు కార్మికులకు అస్వస్థత

... 5వ పేజీ తరువాయి

మల్లికార్జునరావు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తగిన భద్రత లేకపోవడం వల్లే ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పంట కాలువ దర్జాగా కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఇరిగేషన్ ఏఈ జి.శ్రీరామ్మూర్తి అక్కడకు వెళ్లి, షెడ్డును తొలగించాలని ఆక్రమణదారునికి నోటీసులు ఇచ్చారు. పంట కాలువను ఆక్రమించి నిర్మించిన షెడ్డును తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. కానీ సదరు ఆక్రమణదారుడు షెడ్డును తొలగించకపోగా, షెడ్డు నిర్మాణంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదంటూ కొంతమంది రైతులతో సంతకాలు చేయించి ఏఈకి లేఖ ఇచ్చారు. ఇందుకు అధికారులు అంగీకరించకుండా, పంట కాలువపై ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని, అందువల్ల షెడ్డును తొలించాలని మరోసారి నోటీసు ఇచ్చారు. అనంతరం ఈ విషయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పంట కాలువపై అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించడానికి సహకరించాలని ఇరిగేషన్ ఏఈ లిఖితపూర్వకంగా కోరారు. కానీ ఆ రెండు శాఖల అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదు. ఈ నేపథ్యంలో షెడ్డు తొలగించాలని రైతులు శనివారం మరోసారి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ శాఖకు జ్యుడీషియల్ అధికారాలు లేవని, అందువల్లనే ఇన్నాళ్లు ఆగాల్సి వచ్చిందని, ఫిర్యాదు చేసిన రైతులు తోడుగా వస్తే.. తాము షెడ్డును తొలగిస్తామని ఏఈ శ్రీరామ్మూర్తి చెప్పారు.

విశాఖలో ఐపీఎల్ సందడి

... 5వ పేజీ తరువాయి

అవకాశం లభించింది. గత ఏడాది ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలి మ్యాచ్ చెన్నై సూపర్‌కింగ్స్‌తో, రెండో మ్యాచ్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది కూడా ఐపీఎల్ మ్యాచ్‌లను విశాఖకు కేటాయించే అవకాశముందని భావించి ఏసీఏ ప్రతినిధులు నిర్వహణకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామనే సంకేతాలను పంపించారు. తాజాగా రెండు మ్యాచ్‌లను కేటాయించడంతో పక్కాగా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆంధ్ర క్రికెట్ సంఘానికి ఇటీవల కొత్త కార్యవర్గం ఏర్పడడంతో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

తిమ్మాపురంలో చకచకా అభివృద్ధి పనులు

- రూ.పది లక్షలతో గ్రావెల్ రోడ్డు, విశ్రాంతి, రచ్చబండ షెడ్‌లు, డ్రైనేజీల నిర్మాణాలు



గోకులపాడులో నిర్మించిన రచ్చబండ షెడ్



తిమ్మాపురం రుద్రభూమిలో నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం మేజరు పంచాయతీలో రూ. పది లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంచాయతీ పరిధిలోని గోకులపాడులో రచ్చబండ కోసం షెడ్ నిర్మించగా, తిమ్మాపురంలో చేపట్టిన డ్రైనేజీ పనులు చాలావరకు పూర్తయ్యాయి. ఇక్కడ రుద్రభూమిలో నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్, గ్రామంలో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ కర్రి సత్యరారాయణ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.నాలుగు లక్షలతో తిమ్మాపురంలో గ్రావెల్ రోడ్డు, రూ. మూడు లక్షలతో రుద్రభూమిలో విశ్రాంతి షెడ్, రూ. రెండు లక్షలతో డ్రైనేజీ నిర్మిస్తున్నామన్నారు. అలాగే గోకులపాడులో రూ. లక్ష పంచాయతీ నిధులతో రచ్చబండ కోసం షెడ్ నిర్మించామన్నారు.

శిథిలావస్థకు గొరపూడి రక్షిత తుఫాన్ భవనం

- ఏ సమయంలో కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్న స్థానికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



కూలడానికి సిద్ధంగా ఉన్న గొరపూడిలోని తుఫాన్ రక్షిత భవనం

రాంబిల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడిలో రక్షిత తుఫాన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామంలో ఉన్న ఈ తుఫాన్ భవనం కూలడానికి సిద్ధంగా ఉందని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ భవనం పరిస్థితి భయనకంగా ఉన్నప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడే సమయంలో భవనం పెచ్చులు ఊడి పడుతున్నాయని వారు చెబుతున్నారు. పలు మార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని గొరపూడి గ్రామస్థులు కోరుతున్నారు.

‘ఆలయాల నిర్మాణంతో సుభిక్షం’



దుర్గమ్మను దర్శించుకుంటున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గతంతో పోల్చుకుంటే ఇటీవల కాలంలో అనేక గ్రామాల్లో కొత్త ఆలయాలను నిర్మిస్తున్నారని, దీనివల్ల ఆయా ప్రాంతాలు సుభిక్షంగా వుంటాయని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. నక్కపల్లిలో కొత్తగా నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను, విఘ్నేశ్వర ఆలయాలను ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆగ్రహావేశాలు దూరమవుతాయని చెప్పారు. కోప,తాపాలు లేనప్పుడు కుటుంబం, సమాజం ప్రశాంతంగా వుంటుందన్నారు. అనంతరం ఆయన గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి గణపతి చిత్రపటాన్ని బహూకరించారు. చందనాడలో ఆదివారం దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వీసం రామకృష్ణ దర్శించుకున్నారు. నక్కపల్లి గాంధీనగర్‌లో బాల వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు.మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నేటి నుంచి కొత్తపేట ఆలయ పునః నిర్మాణ మహోత్సవాలు



ఎలమంచిలి కొత్తపేటలో పునః నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయం

ఎలమంచిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలో రామలింగేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ, అష్టబంధన మహా కుంభాభిషేక మహోత్సవానికి కమిటీ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి 5 రోజులుపాటు ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు జరగనున్నాయి. సోమవారం గురువందనం, అనుజ్ఞ మహాగణపతి పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఈ ఐదు రోజుల కార్యక్రమాల కోసం ప్రత్యేక యాగశాలను నిర్మించారు. 21వ తేదీన ఉదయం 11.52 గంటలకు మహాగణపతి, సుబ్రహ్మణ్య, శూలినీ దుర్గా, దక్షిణామూర్తి, కాలభైరవ, నవగ్రహ సహితంగా జీవధ్వజ ప్రతిష్ఠ, అష్టబంధన మహాకుంభాభిషేకాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను సచ్చిదానంద సరస్వతి మహా స్వామి, భాగవతుల గణేశ శ్రీనివాస శర్మల పర్యవేక్షణలో జరుగుతాయి. అనంతరం శివపార్వతుల శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

మత్స్యకారుల సాగు భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న మత్స్యకారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మత్స్యకార కుల పెద్దలు



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తాము అనాధిగా సాగుచేసుకుంటున్న భూమిని ఇతరులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ పూడిమడక మత్స్యకారులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూడిమడక సర్వే నంబరు 82లో 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిని పూడిమడకకు చెందిన మత్స్యకారులు ఎప్పటి నుంచో సాగు చేసుకొని జీవిస్తున్నారు. దీనిపై వచ్చిన ఆదాయాన్ని మత్స్యకార కులపెద్దలు నాలుగు వాటాలు వేసి సాగుదారులకు కొంత కేటాయించి, మిగిలింది గ్రామదేవతల పండగలకు వినియోగిస్తున్నారు. అయితే ఆదివారం కొందరు ఎవరికీ తెలియకుండా ట్రాక్టర్ సహాయంతో దున్నడం ప్రారంభించారు. దీనిని సాగుచేస్తున్న మత్స్యకారులు వారిని అడ్డుకొన్నట్టు కులపెద్దలు మేరుగు కాసుబాబు, మేరుగు ఎర్రినాయుడు, వాసుపల్లి తాతయ్య, వాడమదుల సోములు, బొడ్డు జగ్గ తెలిపారు. ఈ మేరకు వీరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యాలయాలను సందర్శించిన పోలీసులు



తిమ్మాపురం కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ విభీషణరావు



నక్కపల్లి గురుకులంలోని బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సన్నిబాబు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం కేజీబీవీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం నక్కపల్లి సీఐ ఎల్.రామకృష్ణ, స్థానిక ఎస్‌ఐ విభీషణరావు సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాలికలందరూ ప్రధానంగా చదువులో రాణించే విధంగా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అలాగే సెల్‌ఫోన్ వాడుక విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై బాలికలకు పలు సూచనలు చేశారు. అనంతరం బాలికల భద్రతకు సంబంధించి విద్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ, ఎస్‌ఐ పరిశీలించారు.

మునగపాకలో..

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని స్థానిక ఎస్‌ఐ పి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండలంలో పాటిపల్లిలో కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. బాలికలు యుక్త వయస్సులో తీసుకునే నిర్ణయాలు వారి భవిష్యత్ జీవితాలకు ముడిపడి ఉంటాయని తెలిపారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఆకతాయిలు వస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

నక్కపల్లిలో..

స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఆదివారం సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ట్రాఫిక్ నిబంధనలపై బాలికలకు ఎస్‌ఐ సన్నిబాబు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి? సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఎస్‌ఐ వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సువర్ణకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

నేడు రెండు మండలాల్లో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం సోమవారం పది గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. దిబ్బపాలెం, ఆర్ఆర్ కాలనీ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, వెదురువాడ, వైఎస్ఆర్ నగర్, సాయిప్రియ లేఅవుట్, బర్మాకాలనీ, మార్టూరు రోడ్, మరిడిమాంబ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని కోరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్.రాయవరం మేజర్ పంచాయతీ తోపాటు వాకపాడు, వెంకటాపురం, సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో ఉన్న ఆక్వా చెరువుల ప్రదేశాల్లో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతోపాటు ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన



అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అంతా వ్యతిరేకించాలని సీపీఎం కన్వీనర్ రొంగలి రాము కోరారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం అచ్యుతాపురం జంక్షన్‌లో నిరసర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎంతో ఉపయోగపడే ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో మోదీ మొండిచేయి చూపించారన్నారు. కార్యక్రమంలో గూడూరు వరలక్ష్మి, కె.రామసదాశివరావు, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

పాడి రైతు ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు



హరిపాలెంలో పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): లాభాపేక్ష లేకుండా పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మండలంలోని హరిపాలెంలో ఆదివారం కొత్త పాలసేరణ కేంద్రాన్ని ఒక సాధారణ పాడి రైతుతో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డెయిరీలు కన్నా పాడిరైతుల నుంచి అధిక ధరకు పాలు కొనుగోలు చేస్తున్న ఏకైక డెయిరీ హెరిటేజ్ అన్నారు. పశువులతోపాటు వాటిని పెంచే రైతులకు కూడా బీమా వర్తింపజేస్తున్నామన్నారు. పశువులకు కేవలం రూ. 50కే కృత్రిమ గర్భదారణ ఇంజక్షన్‌లు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల సూర్యనారాయణ, కె. జగ్గారావు, శ్రీనివాసరావు, రామ అప్పారావు, మహేష్ పాల్గొన్నారు.

ధ్యానం కొండంత ధైర్యం

- పిరమిడ్ ధ్యాన గురువు సుజాత



ప్రత్యేక శిక్షణ పొందుతున్న పదో తరగతి విద్యార్థులు

మునగపాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధ్యానం కొండంత ధైర్యాన్ని ఇస్తోందని, ఒత్తిడిని దూరం చేసి చదువుపై ధ్యాస పెంచుతోందని చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన గురువు సుజాత అన్నారు. మండలంలో నాగులాపల్లి చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీనిలో భాగంగా చదువుపై ఆసక్తి పెరగడానికి విద్యార్థులు చేపట్టవలసిన అంశాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం, ధ్యానం చేయడం వలన మెదడు చురుగ్గా పనిచేస్తోందన్నారు. ఏ విధంగా చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు.

ఘనంగా వినోద్‌రాజు జన్మదిన వేడుకలు



వినోద్‌రాజుకు కేక్ తినిపిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరులో మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు కూటమి నాయకులతోపాటు ఆయన అభిమానులు వినోద్‌రాజు స్వగృహానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తదితర నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌రాజు, గుర్రం రామకృష్ణ, పోలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడు వాహనానికి రూ.74 వేలు జరిమానా

మునగపాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్తున్న లారీని గుర్తించి, రూ.74వేలు జరిమానా విధించడం జరిగిందని ఎస్.ఐ పి.ప్రసాదరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగించే వాహనాలపై చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని, అది రక్షణ కవచం వంటిదన్నారు.

అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు

ఎలమంచిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం వినాయక, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా ఉమానాగలింగేశ్వరస్వామి కల్యాణం

రాంబిల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలూరులో కొలువైన ఉమానాగలింగేశ్వరస్వామి వారి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు స్వామివారికి కల్యాణం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించారు. మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు.

రేవుపోలవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు మండల కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. విశ్రాంతి టీచర్లు అల్లు అప్పలరాజు, సింహాచలం, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ హెచ్ఆర్ డీజీఎం మహాపాత్ర

పరవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చునని సింహాద్రి ఎన్టీపీసీ హెచ్ఆర్ విభాగం డీజీఎం శ్రీమంత మహాపాత్ర అన్నారు. వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాలస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులంతా స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ పోటీల్లో పన్నెండు జట్లు తలపడుతున్నాయి. ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు, సభ్యులు కూంద్రపు శ్రీనివాస్, గండి ఈశ్వరరావు, కూంద్రపు తాతాజీ, గండి శ్రీను, గొంప మారునాయుడు, పెదిశెట్టి రామారావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మహా శివరాత్రి విశిష్టతపై ఇంటింటా ప్రచారం


జాజులవానిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రతినిధులు

పరవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినం విశిష్టతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆది వారం జాజులవానిపాలెంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ బుధవారం ఈ వేడుక జరగనుంది. శివలింగంపై ఉన్న మూడు విభూతిరేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తులాంటివన్నారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొందడమని పేర్కొన్నారు. శివరాత్రిని మోక్ష రాత్రి అని కూడా పిలువ వచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ ప్రతినిధులు కె.శ్రీనివాస్, రమణ, లక్ష్మి, సత్యవతి, మంగ, మల్లేశ్, అప్పారావు, దేవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నిస్వామికి ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు

కొత్తూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలో గల భోగలింగేశ్వర స్వామి వంశపారంపర్య ప్రధాన అర్చకుల్లో ఒకరైన పేరూరి చిన్నిస్వామి స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో ఆదివారం ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఆలయంలో దేవతామూర్తులు, పరమశివుడ్ని అందంగా అలంకరణ చేసే విభాగంతో పాటు సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించినట్టు ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు.


అవార్డు అందుకున్న చిన్నిస్వామి

తాళ్లపాలెంలో 72 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

కశింకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం రామాలయం వద్ద ఆదివారం మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్ తొలుత ప్రారంభించారు. 72 మందికి కంటి పరీక్షలు జరిపారు. ఇందులో ఇరవై మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

కశింకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు జి.వరలక్ష్మి, శివలక్ష్మి, సీఐటీయూజిల్లా ప్రతినిధులు శంకర్, దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో పని భారం పెరుగుతున్నందున ప్రతి 50మంది విద్యార్థులకు ఒక్కొక్కరి చొప్పున పారిశుధ్య కార్మికులను నియమించాలని, కార్మికులకు అనారోగ్యం సోకితే ఆసుపత్రికి వెళ్లేందుకు సెలవు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో సునీత, సింహాచలం, రమణమ్మ, అప్పలనరసమ్మ, లక్ష్మి తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఛీనబాబు కాలనీ

- మేజర్ పంచాయతీ తుమ్మపాలలోని మూడు వార్డుల్లో సమస్యలు తిష్ఠ
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు, రోడ్లపై మురుగు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నివాసితులు.. పట్టించుకోని అధికారులు


మెయిన్ డ్రైన్ లేకుండా దర్శనమిస్తున్న తుమ్మపాల మెయిన్‌రోడ్డు

తుమ్మపాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాల పంచాయతీలోని చినబాబు కాలనీ సమస్యల సుడిలో చిక్కుకుంది. చెత్త, మురుగు, వీధిలైట్ల సమ్యలు ఇక్కడి వారిని వీడని పీడలా వెంటాడుతున్నాయి. దీంతో నివాసితులంతా తీవ్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో గల ఈ కాలనీలో 12, 16, 17 వార్డులు ఉండగా, దాదాపు ఏడువేలమంది జనాభా నివాసం ఉంటున్నారు. అధికంగా ఉద్యోగులు నివసించే ప్రాంతం కావడంతో అధికశాతం పన్నులు ఇక్కడి నుంచే పంచాయతీకి అందుతున్నాయి. విధిగా పన్నులు చెల్లిస్తున్నా కాలనీలో సమస్యలు పరిష్కారం కావడం లేదని వారంతా వాపోతున్నారు.

రోజుల తరబడి మురుగు తిష్ఠ

కాలనీలో డ్రైన్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాడుకనీరు రోడ్లపైకి విడిచిపెడుతుండడంతో రోజుల తరబడి తిష్ఠ వేసి మురుగుగా మారుతోంది. దీంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో అంతా అవస్థలు పడుతున్నారు. ఈ కారణంగా తరచూ వ్యాధులకు గురవుతున్నామని వాపో తున్నారు. తుమ్మపాల మెయిన్‌రోడ్డులో ప్రధాన డ్రైన్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ రూ.మూడు కోట్లు మంజూరు చేశారు. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదన మూలకు చేరింది. దీంతో మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న వీధుల్లో వాడుకనీరంతా రోడ్డుపై రోజుల తరబడి నిలిచిపోతోంది.


కాలనీలో రోడ్డుపై నిలిచిపోయిన మురుగు

ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే...!

ఇక్కడ ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది కొరత కారణంగా రోజుల తరబడి వీధుల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో కుక్కలు, పందులు అందులో దొర్లుతూ మరింత చిందరవందర చేస్తున్నాయి. వర్షా కాలంలో చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు.

అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ

చినబాబు కాలనీలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పలుచోట్ల ఇవి పాడవ్వడంతో చీకటిపడితే అంధకారం అలుముకుంటోంది. దీంతో రాత్రివేళ ఆయా ప్రాంతాలవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో పట్టపగలు సైతం వీధి దీపాలు వెలుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఈ సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.


విద్యుత్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త


ఆర్అండ్‌బీ రోడ్డులో...

సమస్యలు పరిష్కరించండి



చినబాబు కాలనీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఏళ్ల తరబడి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక్కడి పరిస్థితులను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా స్పందన కానరావడం లేదు.

- సందిన చినబాబు, కాలనీవాసి

సండే.. ఎక్కడి చెత్త అక్కడే!

- అనకాపల్లిలో ఏ రోడ్డు చూసినా ఇదే దుస్థితి
- పారిశుధ్య కార్మికులకు సెలవు దినం కావడంతో సమస్య
- రొటేషన్ పద్ధతిలో పనిచేయిస్తే పరిస్థితి మెరుగుపడుతుందని పలువురు సూచన



డీసీఎంఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో ఆదివారం వస్తేచాలు ఏ రోడ్డు చూసినా చెత్త దర్శనమిస్తుంది. పారిశుధ్య కార్మికులకు సెలవు దినం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఆయా చెత్తకుప్పల్లో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తూ మరింత చిందరవందర చేస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జీవీఎంసీ అనకాపల్లి పరిధిలో రోజుకు 80 నుంచి 90 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. ఎప్పటికప్పుడు అధికారులు దీనిని తొలగిస్తున్నా పలు ప్రాంతాల్లో చెత్త నిల్వ ఉండిపోతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి, ఇప్పటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అనకాపల్లి పర్యటనకు విచ్చేసిన సందర్భంగా కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్‌లోని కొంత భాగం దుర్గంధంగా కనిపించడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్మికులకు సెలవు కావడం వల్ల పరిశుభ్రతకు అవకాశం లేకపోయిందని నాడు అధికారులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఆదివారం కూడా కార్మికులతో ఒక పూట పనిచేయించి తర్వాత రోజులో పనిచేసిన పూటకు మరో పూట సెలవు కల్పించాలని సూచించారు. అప్పటి నుంచి అధికారులు ఆదివారం రోజున ఉదయం వేళలో పనిచేయించి మిగతా రోజుల్లో ఏదో రోజు ఒకపూట సెలవు ఇచ్చేవారు. అయితే ఇటీవల కాలం నుంచి ఆదివారం రోజున కార్మికులు పూర్తిగా సెలవు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా ఆదివారం వస్తే ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతోంది. పట్టణంలోని కూరగాయల మార్కెట్, దళ్లివారి వీధి, డీసీఎంఎస్ కార్యాలయం రోడ్డు, ఏఎంసీ కాలనీ రోడ్డు తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి ఉంది. ఒకపక్క ఈగల మోత, మరోపక్క దోమల బాధతో ప్రజలు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారు. అటువంటిది ఒక రోజులో ఎక్కడ చెత్త అక్కడ ఉండిపోవడం వల్ల మరిన్ని అవస్థలకు గురవుతున్నారు. ఆదివారం పూట చెత్త సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. కొంత మంది పారిశుధ్య కార్మికులనైనా రొటేషన్ పద్ధతిలో ఆదివారం నాడు విధుల్లో ఉంచితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచిస్తున్నారు. ఈ దిశగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.


బాలాజీరావుపేటకు వెళ్లే దారిలో...


ఏఎంసీ కాలనీ రోడ్డులో...

ఈ విషయమై శానిటేషన్ సూపర్‌వైజర్ ఆర్.రవికుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, గతంలో ఆదివారం ఒకపూట కార్మికులు పనిచేసేవారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. తమకు ఆదివారం పూర్తి సెలవు ఇవ్వాలని కోరడంతో ప్రభుత్వం కూడా అందుకు అంగీకరించినట్లు చెబుతున్నారు. సోమవారం నాడు పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి విశాఖలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తామని చెబుతున్నారు.

ఆకతాయిల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ లక్ష్మణరావు

కశింకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆకతాయిల పట్ల విద్యార్థినులంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. కశింకోటలో గల సమగ్ర సాంఘిక సంక్షేమ బాలిక వసతి గృహంలో ఆదివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో బాలికలదే పైచేయి అని, అటువంటి వారికి మరింత భద్రత కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి అంతా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బయటకు వెళ్లేటప్పుడు ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నిర్మల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వసతి గృహంలో విద్యార్థినుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

సినీ హీరో సాయిరాం శంకర్‌కు సత్కారం


ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాయిరాం శంకర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరో సాయిరాం శంకర్‌ను అభిమానులు ఆదివారం ఇక్కడ కలిశారు. విశాఖ నుంచి నర్సీపట్నం సమీపంలోని స్వగ్రామానికి వెళ్తున్న అతనిని స్థానికంగా ఉన్న ఓ హోటల్ వద్దకు ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామాపురంలో మంగళవారం జరగనున్న నల్లమారమ్మ ఉత్సవ పోస్టర్‌ను ఆయన ద్వారా ఆవిష్కరింపజేశారు.

ఆరిపాకలో పైడితల్లమ్మ తీర్థం రేపు

సబ్బవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక దరి టెక్కలిపాలెం జంక్షన్ వద్ద కొలువుదీరిన పైడితల్లమ్మ తీర్థం మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేవడుతున్నారు. ఇప్పటికే విద్యుద్దీపాలంకరణ పనులు పూర్తిచేశారు. ఆ రోజు వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 4328 మంది హాజరు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు 4328 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 106 మంది గైర్హాజరయ్యారన్నారు. ఉదయం పరీక్షకు 2313 మంది, మధ్యాహ్నం 2015 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.

నేలబావిలో పడి రైతు మృతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు రైతు నేలబావిలో పడిమృతి చెందాడు. ఇందుకు సంబంధించి రూరల్ సీఐ రేవతమ్మ తెలిపిన వివరాలివి. నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ బంగారయ్యపేటకు చెందిన చిటికెల అప్పలనాయుడు(50) ఆదివారం గ్రామ శివారులో ఉన్న నేల బావిలో నీటిని మోటారు సహాయంతో తోడేందుకు వెళ్లాడు. నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు జారి ఆ బావిలో పడిపోవడంతో మృతిచెందాడు.

నాలుగు దశాబ్దాల స్నేహ సుగంధం

- అనకాపల్లిలో కలుసుకున్న ఏఎంఏఎల్ కళాశాల 1984 డిగ్రీ బ్యాచ్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాల 1984 డిగ్రీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో కలుసుకున్నారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకోవడంతో తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బెంగళూరు, హైదరాబాద్, ఖమ్మం తదితర ప్రాంతాలతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థిరపడినవారంతా రావడంతో సందడి వాతావరణం నెలకొంది. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. భీమిలి చినజీయర్‌స్వామి వారి ఆశ్రమానికి చెందిన వేదపండితులతో వేడుకకు హాజరైన దంపతులకు ఆశీర్వచనాలతో పాటు జ్ఞాపికలను అందజేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు సరిసా శ్రీనివాసరావు దంపతులను అంతా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగబాబు, వేగి వెంకటరావు, కె. శ్రీనివాస్, విల్లూరి రెడ్డమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.


కుటుంబాలతో సహా హాజరైన పూర్వ విద్యార్థులు

సబ్బవరంపై మంచు దుప్పటి


సబ్బవరంలో ఉదయం ఎనిమిది గంటలకు దట్టంగా కురుస్తున్న పొగ మంచు

సబ్బవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో గత కొద్దిరోజులుగా పొగ మంచు కురుస్తోంది. ఆదివారం మరింత అధికంగా కురవడంతో అంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేకువజాము ఐదు గంటల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ఎదురుగా వచ్చే మనిషి సైతం కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ఈ కారణంగా వాకింగ్‌కు, పంట పొలాలకు వెళ్లేవారితో పాటు వివిధ పనులపై బయటకు వెళ్లేవారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉదయం తొమ్మిదిన్నర గంటలైనా మంచు తెరలు వీడకపోవడం విశేషం. ఈ వాతావరణం వల్ల పంట దెబ్బతింటుందని జీడిమామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాడేరులో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

రెండు మినీ వ్యాన్‌లు, పది మంది సిబ్బంది నియామకానికి ప్రతిపాదన

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరు మేజర్ పంచాయతీలో పారిశుధ్యం మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఈవోపీఆర్డీ వీఎస్.రమేశ్ తెలిపారు. పాడేరు పట్టణంలో పారిశుధ్యం పనులు ప్రస్తుతం 20 మంది కార్మికులతో మూడు ట్రాక్టర్లను వినియోగిస్తూ చేస్తున్నప్పటికీ, జనాభా ప్రాతిపదిక చూస్తే పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని, వారిపై పని ఒత్తిడి పెరగడంతో అదనంగా మరో పది మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని, రెండు మినీ వ్యాన్‌లకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. గత ఏడాది వరకు ఇంటి పన్నుల బకాయిలు రూ.కోటి 11 లక్షల 69 వేలు ఉండేవని, ఇందులో సుమారు రూ.50 లక్షల వరకు ఐటీడీఏ, ఆర్‌అండ్‌బీ తదితర ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సింది ఉందని చెప్పారు. పట్టణంలో ప్లాన్ లేకుండా గృహ నిర్మాణాలు చేపట్టేవారికి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు.

ఆలయ హుండీ చోరీ

కొయ్యూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) శరభన్నపాలెం-నడింపాలెం మధ్య ఎర్రగొండమ్మతల్లి ఆలయ హుండీ చోరీకి గురైనట్టు స్థానికులు తెలిపారు. ఆలయ తలుపులు ఆదివారం ఉదయం పగులగొట్టి ఉండడంతో స్థానికులు లోపలకు వెళ్లి చూడగా హుండీ చోరీకి జరిగినట్టు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ చర్యలకు పాల్పడడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆలయ భద్రతకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం, విగ్రహాలకు రంగులు వేస్తున్న కమిటీ



ఉత్సవాలకు సిద్ధమువుతున్న ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఇందులో భాగంగా పాడేరు పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పురాతన ఉమా నీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరిదేవి ఆలయం కల్యాణ మహోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అంగరంగవైభవంగా శివరాత్రి ఉత్సవాలను చేపట్టేందుకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యుల పర్యవేక్షణలో శరవేగంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న వివిధ దేవతామూర్తుల విగ్రహాల సుందరీకరణ పనులు, రంగులు వేయడం పూర్తయ్యాయి. 24వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మూడు రోజుల పాటు ప్రసాదం, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు తగిన చర్యలు చేపడుతున్నారు. అలాగే 26వ తేదీన ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేపడుతున్నట్టు ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు తెలిపారు. మూడు రోజులు నిర్వహించే మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సెయింట్ ఆన్స్ వసతిగృహంలో దాడిపై విచారణ

బాలికల హాస్టల్‌లో ఏడో తరగతి విద్యార్థిపై టెన్త్ విద్యార్థులు దాడికి పాల్పడిన వీడియో వైరల్‌పై స్పందించిన అధికారులు



బాలికపై భౌతిక దాడి ఘటనపై విచారణ చేస్తున్న ఎంఈవో విశ్వప్రసాద్

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లోని బాలికల వసతి గృహంలో దాడి ఘటనపై విద్యా శాఖాధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ హాస్టల్‌లోని ఏడో తరగతి చదుతున్న బాలికపై పదో తరగతి విద్యార్థినులు భౌతిక దాడికి పాల్పడిన వీడియో ఆదివారం వైరల్ కావడంతో విద్యా శాఖాధికారులు స్పందించారు. డీఈవో పి.బ్రహ్మాజీరావు ఆదేశాల మేరకు ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని విచారించారు. ఈ ఘటన గత నెల 5వ తేదీన జరిగినట్టు విచారణలో నిర్ధారణ జరిగిందని, ఈ విషయంపై డీఈవోకు నివేదికను అందిస్తామని ఎంఈవో తెలిపారు. అలాగే సోమవారం డీఈవో పాఠశాలను సందర్శించి విచారణ చేపడతారని చెప్పారు.

అలాగే సెయింట్ ఆన్స్ పాఠశాలలో చిన్న పిల్లలను పెద్ద పిల్లలు ర్యాగింగ్ చేస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నట్టు వివిధ వాట్సాప్ గ్రూప్‌లలో వీడియో వైరల్ కావడంతో స్పందించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పాఠశాలకు చేరుకొని ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం తీరు అధ్వానంగా ఉందని, గతంలో కూడా పలు అభియోగాలు వచ్చాయని చెప్పారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులు ఫోన్‌లు వినియోగిస్తుంటే యాజమాన్యం ఏం చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఘటన, యాజమాన్యం తీరుపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంత పాఠశాలల్లో తరచూ రకరకాల సంఘటనలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని విద్యార్థులలో క్రమశిక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

పంట కాలువ దర్జాగా కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఇరిగేషన్ ఏఈ జి.శ్రీరామ్మూర్తి అక్కడకు వెళ్లి, షెడ్డును తొలగించాలని ఆక్రమణదారునికి నోటీసులు ఇచ్చారు. పంట కాలువను ఆక్రమించి నిర్మించిన షెడ్డును తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. కానీ సదరు ఆక్రమణదారుడు షెడ్డును తొలగించకపోగా, షెడ్డు నిర్మాణంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదంటూ కొంతమంది రైతులతో సంతకాలు చేయించి ఏఈకి లేఖ ఇచ్చారు. ఇందుకు అధికారులు అంగీకరించకుండా, పంట కాలువపై ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని, అందువల్ల షెడ్డును తొలించాలని మరోసారి నోటీసు ఇచ్చారు. అనంతరం ఈ విషయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పంట కాలువపై అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించడానికి సహకరించాలని ఇరిగేషన్ ఏఈ లిఖితపూర్వకంగా కోరారు. కానీ ఆ రెండు శాఖల అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదు. ఈ నేపథ్యంలో షెడ్డు తొలగించాలని రైతులు శనివారం మరోసారి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ శాఖకు జ్యుడీషియల్ అధికారాలు లేవని, అందువల్లనే ఇన్నాళ్లూ ఆగాల్సి వచ్చిందని, ఫిర్యాదు చేసిన రైతులు తోడుగా వస్తే.. తాము షెడ్డును తొలగిస్తామని ఏఈ శ్రీరామ్మూర్తి చెప్పారు.

విశాఖలో ఐపీఎల్ సందడి

... 5వ పేజీ తరువాయి

అవకాశం లభించింది. గత ఏడాది ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలి మ్యాచ్ చెన్నై సూపర్‌కింగ్స్‌తో, రెండో మ్యాచ్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది కూడా ఐపీఎల్ మ్యాచ్‌లను విశాఖకు కేటాయించే అవకాశముందని భావించి ఏసీఏ ప్రతినిధులు నిర్వహణకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామనే సంకేతాలను పంపించారు. తాజాగా రెండు మ్యాచ్‌లను కేటాయించడంతో పక్కాగా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆంధ్ర క్రికెట్ సంఘానికి ఇటీవల కొత్త కార్యవర్గం ఏర్పడడంతో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

టొరెంట్ ఫార్మాలో ఇద్దరు కార్మికులకు అస్వస్థత

... 5వ పేజీ తరువాయి

మల్లికార్జునరావు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తగిన భద్రత లేకపోవడం వల్లే ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తరాంధ్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చునని సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌ఆర్ విభాగం డీజీఎం శ్రీమంత మహాపాత్ర అన్నారు. వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాలస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులంతా స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ పోటీల్లో పన్నెండు జట్లు తలపడుతున్నాయి. ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సభ్యులు కూంద్రపు శ్రీనివాస్, గండి ఈశ్వరరావు, కూంద్రపు తాతాజీ, గండి శ్రీను, గొంప మారునాయుడు, పెదిశెట్టి రామారావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మహా శివరాత్రి విశిష్టతపై ఇంటింటా ప్రచారం

పరవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినం విశిష్టతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జాజులవానిపాలెంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ బుధవారం ఈ వేడుక జరగనుంది. శివలింగంపై ఉన్న మూడు విభూతిరేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తులాంటివన్నారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొందడమని పేర్కొన్నారు. శివరాత్రిని మోక్షరాత్రి అని కూడా పిలువ వచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ ప్రతినిధులు కె.శ్రీనివాస్, రమణ, లక్ష్మి, సత్యవతి, మంగ, మల్లేశ్, అప్పారావు, దేవి తదితరులు పాల్గొన్నారు.

అరకు క్వెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం



నగదు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరురూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అరకు చలి ఉత్సవ్‌లో భాగంగా గత నెల 31వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన ద గ్రేట్ అరకు క్వెస్ట్‌లో గెలుపొందిన వారికి జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో నగదు బహుమతులు అందజేశారు. ఉత్సవ్‌లో పాల్గొని అరకు కెస్ట్‌లో విజేతలుగా నిలిచిన ధ్రువ అండ్ టీం (ధ్రువ, కరుణ్ కుమార్, లచ్చన్నదొర, మోహన్, ఆనంద్)కు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, మంగ తల్లి టీం (వి.జ్యోతి స్వరూప్, వి.శివాజీ, పి.మహాలక్ష్మి, రోజారాణి)కు ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, హెచ్‌బీ.భాస్కర్‌రెడ్డి టీం(కె.గణేష్, మణిశంకర్, జి.కాశీ విశ్వనాథ్, కె.హరికృష్ణ)కు తృతీయ బహుమతిగా రూ.20 వేలు ప్రకటించిన విషయం తెలిసిందే. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఆదివారం ప్రత్యేక కార్యక్రమంలో నగదు బహుమతులను అందించి వారిని అభినందించారు. అదే విధంగా బొర్రా గృహలు నుంచి అరకు వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సుంకరమెట్ట పంచాయతీ గుమ్మకోట గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల ఆరో తరగతి విద్యార్థి పి.అజయ్‌కు సైకిల్‌తో పాటు కిట్‌ను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన మ్యూజియం క్యూరేటర్ వి.మురళి, ఆయా బృందాల సభ్యులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు అమ్మవారి మొక్కులు తీర్చుకొనేందుకు మైదాన ప్రాంతం నుంచి వచ్చిన వందలాది మంది భక్తులతో ఆలయం ఉదయం 6 గంటల నుంచి రద్దీగా మారింది. అమ్మవారి దర్శనానికి భక్తులు కూకట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం శాస్త్రి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సాయంత్రం వరకు గడిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సల్లా రామకృష్ణ, బి.వెంకటరమణ, దన్నేటిపలాసి రాము, కిల్లు రాధాకృష్ణం నాయుడు, లకే రత్నాబాయ్, కారం దేముడు, గబులంగి శంకరరావు, చంద్రమోహన్‌కుమార్ పాల్గొన్నారు.

కొక్కిరాపల్లిలో క్రికెట్ పోటీలు

జి.మాడుగుల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొక్కిరాపల్లి కొక్కిరమ్మ జాతర మహోత్సవాలు పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు జర్ర అంకిత్ తెలిపారు. క్రికెట్‌కు ఎంట్రీ ఫీజు రూ.1100, వాలీబాల్ రూ.600 ప్రకటించారు. అలాగే అంకిత్ ఆధ్వర్యంలో కొక్కిరమ్మ జాతర మహోత్సవాలు మార్చి 19 నుంచి 21వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు జి.సన్యాసిదొర, కె.ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ మత్స్యరాజు, నాయకులు పి.రాములు, బాబూజీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పాడేరుకు చెందిన పి.రాజబాబు (47) కొట్లాట కేసులో ముద్దాయి. కొయ్యూరు పోలీసుస్టేషన్‌లో ఇతడిపై కేసు నమోదైంది. 2024 నవంబర్ నుంచి విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న అతడికి కాళ్లు, చేతులపై వాపు రావడంతో జైలు వైద్యశాలలో చికిత్స అందించారు. శనివారం అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థులకు సదుపాయాలు మెరుగుపర్చండి

ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రోహిత్



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

చింతపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో విద్యార్థులకు సదుపాయాలు మెరుగుపర్చాలని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రోహిత్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమశాఖ బాలికలు, బాలుర ఆశ్రమ, ఏకలవ్య పాఠశాలలు, గురుకుల జూనియర్ కళాశాల వసతి గృహాలను న్యాయమూర్తి సందర్శించారు. విద్యార్థులకు అందుబాటులోనున్న సదుపాయాలు, భోజనాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం మెరుగుపర్చాలని సూచించారు. వసతి, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యాధికి గురైతే వెంటనే మెరుగైన వైద్యం అందించాలన్నారు. మెనూ ఆధారంగా భోజనాలు పెట్టాలన్నారు. ప్రతీ రోజు రుచికరమైన నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని స్పష్టం చేశారు. వార్డెన్లు అన్నివేళలా విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేస్తున్నామని, మంచినీరు, ప్రహరీ గోడలు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని న్యాయమూర్తికి వివరించారు. విద్యార్థుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని న్యాయమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తాం

యూనియన్ మండల అధ్యక్షుడు సన్యాసిరావు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ ప్రతినిధి సన్యాసిరావు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని మల్టీఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గొల్లోరి సన్యాసిరావు అన్నారు. మల్టీఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల ఫొటో, వీడియోగ్రాఫర్ల సమావేశం నిర్వహించారు. మొదటిగా యూనియన్ నియమ నిబంధనలు, నెల వారీ పొదుపు సొమ్ము సేకరణ, ఐడెంటీ కార్డులు జారీ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సన్యాసిరావు మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రాఫర్లు కార్యక్రమాలకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే యూనియన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే యూనియన్ బలోపేతానికి అందరూ తమవంతు సహకారం అందించాలని, యూనియన్ నిబంధనలకు అనుగుణంగా సభ్యులు నడుచుకోవాలని కోరారు. యూనియన్‌లో ఉన్న సభ్యులకు వృత్తిపరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తమదృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.సభ్యులు ప్రతీ నెల విధిగా పొదుపు సొమ్ము రూ.200 చెల్లించాలని, ఆ సొమ్మును సభ్యుల సాధక బాధలకు వినియోగించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టుకు చెందిన మల్టీఫొటోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గంప విక్రమ్, కార్యదర్శి కొర్రా బాబూలాల్, ఉప కార్యదర్శి గంపరాయి అనిల్‌కుమార్, పెదబయలు యూనియన్ కార్యదర్శ పలాసి రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగ యువతకు పార్ట్ టైం ఉద్యోగాలు: డీఎస్పీ అహ్మద్



గిరిజన క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న డీఎస్పీ అహ్మద్

హుకుంపేట ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన నిరుద్యోగ యవతకు అర్హత ఆధారంగా పార్ట్ టైం ఉద్యోగాలు కల్పిస్తామని డీఎస్పీ అహ్మద్ తెలిపారు. మండలంలోని మారుమూల భూర్జ పంచాయతీ కేంద్రంలో ఆదివారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సురేశ్‌తో కలిసి డీఎస్పీ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణాకు సహకరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంతటి స్థాయి వ్యక్తులపైనైనా కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. పిల్లలకు మంచి చదువు చదివించాలని, దానివల్ల ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని సూచించారు. చదువుకుని ఖాళీగా ఉన్న యువతీ, యువకులకు కమ్యూనిటీ పోలిసింగ్ లేదా ప్రైవేట్ కంపెనీల్లో అర్హత ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని డీఎస్పీ అహ్మద్ హామీ ఇచ్చారు. ఇందుకోసం స్థానిక మహిళా పోలీసులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్ష వాయిదా

పెదబయలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 25వ తేదీన జరగాల్సిన రాత పరీక్షను వాయిదా వేసినట్టు పెదబయలు ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ అమిత్‌కుమార్ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని అన్ని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఉమామహేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

సీలేరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీలేరు ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహాశివరాత్రి ఉత్సవాలు, శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం ఆలయ నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా ఏపీజెన్‌కో ఎస్ఈ బి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడిగా జెన్‌కో ఈఈ ఎన్.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా విష్ణుకుమార్ (ఎపీట్రాన్స్), కార్యదర్శిగా డి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా జి.లక్ష్మణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పవన్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఓబీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.ఉమా, కోశాధికారిగా అయినాడ శివ, సభ్యులుగా కె.దేవి, చదరం మారిబాబు, పి.మహేశ్ తదితరులు ఎన్నికయ్యారు.

గ్రామంలోనే పాఠశాల కొనసాగించాలి



సుబ్బులు పాఠశాల ఆవరణలో నినాదాలు చేస్తున్న తల్లిదండ్రులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్లంకోట పంచాయతీ సుబ్బులులో ఉన్న పాఠశాలను విలీనం చేయరాదని బీసీవైపార్టీ జిల్లా ఇన్‌చార్జీ కిలో రాజన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజన్ మాట్లాడుతూ సుబ్బులుతో పాటు కిల్లంకోట, సారపల్లి గ్రామాల్లో ఉన్న పాఠశాలలను విలీనం చేయడాన్ని తప్పుపట్టారు. ఇది వర్షాకాలంలో తీవ్రమైన పరిస్థితులకు దారి తీస్తుందని, ఫలితంగా డ్రాపౌట్ పెరగడానికి అస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. ఈ అంశాన్ని ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని విద్యారులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

చిన్నిస్వామికి ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు



అవార్డు అందుకున్న చిన్నిస్వామి

కొత్తూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో గల భోగలింగేశ్వరస్వామి వంశపారంపర్య ప్రధాన అర్చకుల్లో ఒకరైన పేరూరి చిన్నిస్వామి స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో ఆదివారం ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఆలయంలో దేవతామూర్తులు, పరమశివుడ్ని అందంగా అలంకరణ చేసే విభాగంతో పాటు సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించినట్టు ఆయన విలేకరులకు తెలిపారు.

తాళ్లపాలెంలో 72 మందికి కంటి పరీక్షలు

కశింకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం రామాలయం వద్ద ఆదివారం మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్ తొలుత ప్రారంభించారు. 72 మందికి కంటి పరీక్షలు జరిపారు. ఇందులో ఇరవై మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలి

కశింకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు జి.వరలక్ష్మి, శివలక్ష్మి, సీఐటీయూజిల్లా ప్రతినిధులు శంకర్, దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో పనిభారం పెరుగుతున్నందున ప్రతి 50మంది విద్యార్థులకు ఒక్కొక్కరి చొప్పున పారిశుధ్య కార్మికులను నియమించాలని, కార్మికులకు అనారోగ్యం సోకితే ఆసుపత్రికి వెళ్లేందుకు సెలవు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో సునీత, సింహాచలం, రమణమ్మ, అప్పలనరసమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పెదబొడ్డేపల్లికి చెందిన

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అమెరికాలో మృతి

▸▸ ప్రత్యేక విమానంలో స్వగృహానికి చేరిన మృతదేహం



గిరీశ్ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో చనిపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం ఆదివారం నర్సీపట్నం చేరుకుంది. మునిసిపాలిటీలోని పదో వార్డు పరిధి పెదబొడ్డేపల్లికి చెందిన నిద్ర గిరీశ్ (38) అమెరికాలోని టీసీఎస్ కంపెనీలో గత ఆరేళ్లుగా పనిచేస్తున్నారు. ఈనెల మూడవ తేదీ తెల్లవారుజామున అక్కడి ఆయన నివాసంలో గుండెపోటు రావడంతో మృతిచెందారు. గిరీశ్‌కు ఏడేళ్ల క్రితం వివాహమైంది భార్య, బాబు ఉన్నారు. తండ్రి ప్రసాద్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. నాలుగు నెల క్రితం పెదబొడ్డేపల్లి వచ్చి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి వెళ్లారు. గిరీశ్ ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు సోకసముద్రంలో మునిగిపోయారు. టీసీఎస్ కంపెనీ అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో మృతదేహాన్ని ఇండియా తరలించింది. ఆదివారం ఉదయం పెదబొడ్డేల్లికి మృతదేహం చేరుకోగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

23న అల్లూరి సమాధుల వద్దకు శతవర్ధంతి జాతా

కృష్ణాదేవిపే, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి శతవర్ధంతి సందర్భంగా జాతా నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, కార్యదర్శి ఎస్.గోవిందరాజు ఆదివారం తెలిపారు. అల్లూరిని 1924 మే 7వ తేదీన బ్రిటీష్ పోలీసులు పట్టి బంధించి, కాల్చి చంపారన్నారు. అటువంటి పోరాట యోధుడు త్యాగాల వలన మనదేశానికి స్వాతంత్ర్యం లభించిందని వివరించారు. అల్లూరి జీవిత విశేషాలు నేటితరానికి తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి వార్షిక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 2024 మే ఏడవ తేదీ నుంచి 2025 మే ఏడవ తేదీ వరకు ఏడాది పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం నుంచి అల్లూరి సమాధులున్న కృష్ణాదేవిపేట వరకు అల్లూరి శతవర్ధంతి జరుపుతున్నట్టు చెప్పారు. 23వ తేదీన గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి సమాధుల వద్ద వందలాది మంది విద్యార్థులు, యువతీ యువకులు, మేధావులు, ఈ ప్రాంత ప్రజలు జాతాలో పాల్గొని అల్లూరి, గంటందొర సమాధుల వద్ద నివాళులర్పించాల్సిందిగా వారు కోరారు.

బైక్ మెకానిక్ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



మెకానిక్ బాబ్జీకి ఆర్థిక సహాయం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ స్ట్రోక్‌తో అనారోగ్యానికి గురైన పట్టణంలోని టూ వీలర్ మెకానిక్ బాబ్జీకి తోటి మెకానిక్‌లు బాసటగా నిలిచారు. ఈ మేరకు ఆదివారం విజయదుర్గా టూ వీలర్ మెకానిక్‌ల సంఘం ఆధ్వర్యంలో రూ.70వేల ఆర్థిక సాయాన్ని వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాకిరెడ్డి అప్పారావు, చిరంజీవి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులు బుక్ రీడింగ్

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 16 : గొలుగొండ శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులు బుక్ రీడింగ్ కార్యక్రమం చేపట్టారు. 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు విద్యార్థులకు నీతి కథలు చదివి వినిపించారు. గ్రంథాలయాలయాన్ని నిత్యం సందర్శించాలని సూచించారు.

ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో నీటి కష్టాలు

▸▸ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జి.కోడూరు, జి.నగరంలలో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు ▸▸ రూ. 2కే ఇరవై లీటర్ల మినరల్ వాటర్ సరఫరా

▸▸ వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడంతో మూలకు చేరిన పరికరాలు ▸▸ ఫిర్యాదులు చేసినా స్పందన లేదని గ్రామస్థులు ఆవేదన



జి.కోడూరులో పనిచేయని ఆర్‌వో ప్లాంట్

మాకరవరపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జి.కోడూరు, జి.నగరంలలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌లు మూలకు చేరాయి. గత కొన్ని నెలలుగా పనిచేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ కారణంగా స్వచ్ఛమైన తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నట్టు చెపుతున్నారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో మండలంలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలను గుర్తించారు. దీంతో జి.కోడూరు గ్రామంతో పాటు జి.నగరం, జి.వెంకటాపురం, జెడ్.గంగవరం గ్రామాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ.7.4లక్షలను ఖర్చు చేసి ఒక్కోచోట ఆర్‌వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ సమయంలో రెండు రూపాయలకే ఇరవై లీటర్ల మినరల్ వాటర్‌ను అందించేవారు. ఈ పథకం ద్వారా గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటిపై ప్రత్యేక దృష్టి సారించేవారు కరువయ్యారు. దీంతో కొన్ని రోజులకే ఒకొక్కటిగా మూలకు చేరడం మొదలుపెట్టాయి. ఇవి పనిచేకపోయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో లక్షాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పరికరాలు ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఇవి తుప్పుపట్టిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నుంచి అరకొరగా నీరు వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు చెపుతున్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి వీటికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకు వాల్సిందిగా అంతా కోరుతున్నారు.



జి.నగరం గ్రామంలో

నేల బావిలో పడి రైతు మృతి



అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి) : ప్రమాదవశాత్తు రైతు నేల బావిలో పడిమృతి చెందాడు. ఇందుకు సంబంధించి రూరల్ సీఐ రేవతమ్మ తెలిపిన వివరాలివి. నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ బంగారయ్యపేటకు చెందిన చిటికెల అప్పలనాయుడు(50) ఆదివారం గ్రామ శివారులో ఉన్న నేల బావిలో నీటిని మోటారు సహాయంతో తోడేందుకు వెళ్లాడు. నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు జారి ఆ బావిలో పడిపోవడంతో మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుని భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆమె చెప్పారు.

నేడు అంగన్‌వాడీలు ధర్నా

నర్సీపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నట్టు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షురాలు సీహెచ్.మహాలక్ష్మి, కార్యదర్శి ఆర్.రమణమ్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యుటీ అమలు చేయాలని కోరుతూ ఈ ఆం దోళన చేపడుతున్నామని చెప్పారు. అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య శిబిరానికి హాజరైన పట్టణవాసులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇక్కడి వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 180 మంది ఈ శిబిరానికి హాజయ్యారు. వీరిలో ముగ్గురిని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారి పేర్లు నమోదు చేసి క్రమపద్ధతిలో వైద్యుల వద్దకు పంపి పరీక్షలు చేయించారు. ఈ శిబిరంలో చైర్మన్ ఊడా సూర్యారావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పద్మనాభుని కొండలరాయుడు, సెక్రటరీ పెనుగొండ రమేశ్, ట్రెజరర్ సుతాపల్లి శ్రావణ్, కేర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

మాకవరపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకూ చివరిసారిగా ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. తొలిరోజు బూరుగుపాలెం, వజ్రగడ, మాకవరపాలెం, గిడుతూరు,శె ట్టిపాలెం, తూటిపాల, కోడూరు, పీపీఅగ్రహారం, పాపయ్యపాలెం, రాచపల్లి గ్రామాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

పి.జగ్గంపేటను వీడని మురుగు సమస్య

దోమలు, దుర్వాసనతో గ్రామస్థులకు ఇబ్బందులు

నాతవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలం పి.జగ్గంపేటను మురుగు సమస్య వీడడం లేదు. వైసీపీకి చెందినవారు కాలువను కప్పేసి ఇళ్లు నిర్మించుకోవడం వల్లే ఈ సమస్య ఏర్పడిందని టీడీపీ గ్రామ అధ్యక్షుడు చింతకాయల గోవిందరావు, నాయకులు అడిగర్ల భాస్కరరావు ఆరోపించారు. మురుగు తిష్ఠ వేస్తుండడం వల్ల ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్‌డీ ఎస్‌వీవీ మూర్తి వద్ద ప్రస్తావించగా, గ్రామంలో మురుగునీరు బయటకు పోకుండా నిల్వ ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

చోద్యంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్



రైతులు వివరాలు నమోదు చేయిస్తున్న ఏవో సుధారాణి

కృష్ణాదేవిపే, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం చోద్యం రైతు సేవా కేంద్రంలో ఆదివారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి కె.సుధారాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి అందిస్తున్న పథకాలు పొందాలంటే తప్పనిసరిగా భూముల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నర్సీపట్నంలో స్పోర్ట్స్ సెలక్షన్స్



పోటీల్లో సెలక్షన్ అయిన బాలికలు

నర్సీపట్నం, అర్బన్ 16 (ఆంధ్రజ్యోతి) : సబ్ జూనియర్స్, జూనియర్స్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సంబంధించి నియోజకవర్గస్థాయి సెలక్షన్ ట్రైల్స్‌ను ఆదివారం ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించారు. మూడు మండలాల నుంచి 42మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు వేపాడ ప్రియాంక్, యర్రా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

▸▸ చోడవరంలో అన్న క్యాంటీన్ కోసం ఏర్పాట్లు

▸▸ ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు



అక్షయపాత్ర సొసైటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు చెప్పారు. స్థానిక ఆపదహర శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ వింజమూరి శంకర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన అక్షయపాత్ర అన్నసమారాధన సేవా సొసైటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో ఇటువంటి సేవా కార్యక్రమాల అమలుకు ముందుకు రావడం ఆనందకరమన్నారు. ఆలయం సమీపంలోని పార్కు అభివృద్ధి చేయడంతో పాటు రూ.5కే తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా త్వరలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటు కానుందని చెప్పారు. అనంతరం అక్షయపాత్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సొసైటీ కన్వీనర్‌గా వింజమూరి శంకర్, గౌరవ అధ్యక్షులుగా కందర్ప రమణమూర్తి, తానవరపు శ్రీనివాస్, గూనూరు ప్రభాకర్ ఉన్నారు. అధ్యక్షుడిగా తాడి పనసారెడ్డి, ఉపాధ్యక్షుడిగా జలుమూరి కాశిరాజు, కార్యదర్శిగా ఉపాధ్యాయుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా అడపా భూలక్ష్మి, కోశాధికారిగా పార్థు, సభ్యులుగా పి.కిరణ్, ప్రసాద్, జ్యోతి, రాజా, పార్వతి, చిన్నలు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డి.వెంకట అప్పారావు, నాయకులు సకురు కోటేశ్వరరావు, ఆర్‌టీవో చిన్న పాల్గొన్నారు.

19న బాలచెంచమ్మ తీర్థ మహోత్సవం



గర్నికంలో కొలువు తీరిన బాలచెంచమ్మ

రావికమతం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని గర్నికం బాలచెంచమ్మ వార్షిక తీర్థ మహోత్సవం ఈ నెల 19న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ గ్రామానికి చెందిన బాలచెంచమ్మ సజీవ సహగమనం చెందడంతో నాటి నుంచి స్థానికులు గ్రామ దేవతగా కొలుస్తున్నారు. ప్రతీ ఇంట్లో మొదటి సంతానానికి బాలచెంచమ్మ పేరుపెట్టడంతో పాటు మొదటి పంట అమ్మవారికే నైవేద్యంగా సమర్పిస్తారు. నిర్వహిస్తున్న పెళ్లిలకు శతమానాలను సైతం అమ్మవారి ఒడిలో ఉంచిన తరువాతే భార్య మెడలో కడతారు. అమ్మవారి మహోత్సవానికి ఎంత దూరంలో ఉన్నప్పటికీ బంధువులు, స్నేహితులతో పాటు ఉత్తరాంధ్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. అమ్మవారికి ప్రీతికరమైన పసుపు కుంకమలతో పాటు చీరలు, రవికలు, అరటి గెలలు, గాజులు, వెండి, బంగారం వంటివి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు తెచ్చిన చీరలు, రవికులు అమ్మవారి వద్దనే విడిచి పెడతారు. ఈ ఏడాది భారీగా భక్తులు తీర్థమహోత్సవానికి హాజరవుతార ఉత్సవ కమిటీ ప్రతినిధులు అంచనా వేశారు. ఇందుకు తగినట్టుగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, సామీయానాలు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే విద్యుత్ దీపాల అలంకరణలు, అధునాతన సెట్టింగ్‌లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండలంలోని మేడిచెర్ల మల్లికార్జునస్వామి దేవాలయ 18వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కోరారు. కాగా ఉదయం నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. అనంతరం మహిళల ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. సాయంత్రం ఎడ్లబండ్ల పరుగు పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, రైవాడ రిజర్వాయర్ చైర్మన్ పోతల పాత్రునాయుడు, నాయకులు పూడి నారాయణమూర్తి, పి.శ్రీనివాసరావు, జూరెడ్డి రాము, కె.సూర్యనారాయణ, కె.అప్పలనాయుడు, బొడ్డు అక్కునాయుడు, బి.వెంకటరమణ, బి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



చుక్కపల్లిలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

చుక్కపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చీడికాడ: మండలంలోని చుక్కపల్లి గ్రామంలో అభయాంజనేయస్వామిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ మహోత్సవంలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, నాయకులు పి.అప్పారావు, ఎం.నానాజీ, ఎస్.తిరుమలనాయుడు ఉన్నారు.

మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి కృషి చేస్తాం

▸▸ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

▸▸ మంగళాపురం ఆయకట్టు రైతులతో సమావేశం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి కృషి చేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు రైతులకు స్పష్టం చేశారు. కుమందానిపేట సమీపంలోని మంగళాపురం వద్ద వర్షాలకు కొట్టుకుపోయిన ఆనకట్టను రైతులు, జనసైనికులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళాపురం ఆనకట్ట కొట్టుకుపోవడం వల్ల ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. వారి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్య తీవ్రత తెలిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆనకట్ట కొట్టుకుపోవడం వల్ల పది గ్రామాల రైతులు సాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించిందని, త్వరలోనే పక్కా ఆనకట్ట నిర్మిస్తుందని హామీ ఇచ్చారు. ఆనకట్ట చైర్మన్ కర్రి రాజారావు, నాయకులు ఎ.రామప్పారావు, డీఎస్ నాయుడు, ఎం.నాయుడు, బి.మహరాజు, కె.రమేశ్, కె.తమ్మునాయుడు, ఎస్.బాబునాయుడు, టి.రమేశ్, కె.మాణిక్యం, డి.సాయి. బాలకృష్ణ, బి.నాయుడు, చింతల కిశోర్, ఎస్.శంకర్ పాల్గొన్నారు.



మంగళాపురం వద్ద ఆయుకట్టు రైతులతో మాట్లాడుతున్న రాజు

రోడ్డు గుంతలో పడి ఊడిన ఆటో చక్రం



యాక్సిల్ రాడ్ విరిగి చక్రం ఊడిన ఆటో

రావికమతం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్డులో వాహన చోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. రావికమతం -కింతలి ఆర్‌అండ్‌బీ రహదారి గతుకుల మయంగా మారడంతో ఇటీవల అభివృద్ధి చేశారు. చినపాచిల ఆంజనేయస్వామి గుడి వద్ద నివాసితుల ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరుకు డ్రైనేజీ సౌకర్యం లేక రోడ్డుపైకే వచ్చేస్తున్నది. ఆ నీరు నిల్వ ఉండిపోవడంతో రోడ్డు శిథిలమై గుంతలుగా ఏర్పడింది. శనివారం రాత్రి పాల సరఫరా చేసే ఓ ఆటో ఈ గోతిలో పడి యాక్సిల్ రాడ్ విరిగిపోయి చక్రం ఊడిపడింది. దీంతో రహదారి మధ్యలోనే ఆటో నిలిచిపోయింది.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కసరత్తు

రావికమతం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధన కోసం ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. మండలంలో మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మినాయుడు, బి.అప్పలనాయుడు, భీంపల్లి ఎర్రయ్య, యు.పాపారావు తదితరులు శనివారం రాత్రి గ్రామంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాలలో నిర్దేశించిన విధంగా చదువుతున్నదీ? లేనిదీ? పరిశీలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు ఏకాగ్రతతో చదివేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా నెల రోజుల పాటు పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు వారు సూచించారు. ఈ నెల రోజులు టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. పరీక్షల భయం కలగకూడదని విద్యార్థులకు వారు మనోధైర్యం కల్పించారు.

పోతురాజుబాబు జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రోలుగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరంలో ఈ నెల 23న నిర్వహించనున్న పోతురాజుబాబు జాతర వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆదివారం ఆవిష్కరించారు. జాతరను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కాగా జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్ర తెలిపారు.

కేశవస్వామి ఆలయంలో అన్నప్రసాదం

చోడవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వయంభూ శ్రీకేశవస్వామి కల్యాణ ఉత్సవాల సందర్భంగా ఆదివారం అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ఉత్సవాల నిర్వహణకు శ్రమించిన అందరికీ అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు, రాంకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భక్తమండలి సభ్యులు ఉపాధ్యాయుల శ్రీనివాస్, టి.శ్రీనివాస్, బ్యాంకు రాము, ఉప్పల బాబు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున నుంచే అమ్మవారికి అభిషేకాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వంటావార్పు నిర్వహించి భోజనాలు చేశారు.

కవి కురచాకు టీడీపీ నేత రవితేజ పరామర్శ

చీడికాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి కురచా నరసింహనాయుడుకు టీడీపీ యువ నేత, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ ఆదివారం పరామర్శించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో అప్పలరాజుపురంలో విశ్రాంతి తీసుకుంటున్న నరసింహనాయుడును తన అనుచరులతో రవితేజ కలిసి ఆరోగ్యంపై ఆరా తీశారు. కాగా, తన కవిత్రయంతో రవితేజ, అతని మిత్ర బృందాన్ని కురచా నవ్వించారు.

గంజాయితో ఇద్దరు యువకుల అరెస్టు

చోడవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి చోడవరం మీదుగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. పట్టణ శివారు గౌరీపట్నం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు నాలుగు కిలోల గంజాయితో పట్టుబడ్డారని, వారి నుంచి వాహనంతో పాటు రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేశామని చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.